

ఆతిథ్యం ఇచ్చేదెన్నడో?
ప్రశాంత వాతావరణానికి నిలయమైన అనంతగిరి గుట్టలో అతిథి గృహ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడంలేదు. 10లో▸



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. 10లో▸



నజరానా.. కథ కంచికేనా?
ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల నజరానా హామీ అమలుకు నోచుకోవడం లేదు. 11లో▸

న్యూస్‌రీల్

మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందించండి



మోమిన్‌పేటలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

మోమిన్‌పేట: వడగండ్లతో కూడిన అకాల వర్షంతో పశువులకు ప్రాణ నష్టం జరిగితే వెంటనే మండల పశు వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. జిల్లా సహాయ సంచాలకుడు ప్రహ్లాద్‌తో కలిసి మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గురువారం కురిసిన వడగండ్ల వర్షంతో పశువులు, జీవాలకు గాయాలయ్యాయని తెలిపారు. వీటికి వెంటనే చికిత్స అందజేయాలని సూచించారు. ప్రాణనష్టం జరగకుండ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులకు సేవతో కూడిన వైద్యం చేయాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, రైతులను బయటకు పంపొద్దని తెలిపారు. అకాల వర్షాలు కురిసే సమయంలో పశువులను, జీవాలను బయట ఉంచకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గీత, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు బ్యాంక్ స్పెషల్ లోక్ అదాలత్

అనంతగిరి: బ్యాంకులో ఉన్న ప్రీ లిటిగేషన్ కేసులు, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం శనివారం బ్యాంక్ స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారి కోసం వన్ టైమ్ సెటిల్మెంట్ కింద కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సీసీ రోడ్లకు రూ.5.15 కోట్లు



నారెగూడలో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో సర్పంచులు, కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని పంచాయత్‌రాజ్ డీఈ మాధవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని నారెగూడ, పూలపల్లి, లింగంపల్లిలో కొనసాగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నవాబుపేట మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మెజార్టీ గ్రామాల్లో ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. ఈ నెల 30 వరకు నిర్మాణాలు పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో ఎఫ్‌టీఓ నమోదు చేయాలని సూచించారు. లేదంటే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. డీఈ వెంట ఎంపీఓ విజయ్‌కుమార్, సర్పంచ్ పర్మయ్య ఉన్నారు.

రైతు సంఘాలను బలోపేతం చేయాలి



రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న రాజేశ్‌సింగ్

యాలాల: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత బలోపేతం చేసి, స్థానికంగా సాగు చేస్తున్న ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ కార్యదర్శి రాజేశ్ సింగ్ సూచించారు. గత మంగళవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన అంతర్జాతీయ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనను శుక్రవారం ఆయన సందర్శించారు. వాణిజ్య పరిశ్రమల శాఖ డిప్యూటీ కార్యదర్శి సచిన్ ధానియాతో కలిసి స్టాళ్లను పరిశీలించారు. యాలాల మండల కేంద్రానికి చెందిన రైతులు మేళాలో ఏర్పాటు చేసిన తాండూరు కంది పప్పు స్టాల్‌ను సందర్శించారు. పప్పు నాణ్యత, పండించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, షేర్ సంస్థ ముఖ్య కార్యదర్శి మరాఠి నర్సింహులుతో మాట్లాడారు.



మోమిన్‌పేట మండలం సయ్యద్‌అల్లీపూర్‌లో ధ్వంసమైన బొప్పాయి తోట

పంట నష్టం 2,000 ఎకరాలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో కురిసిన వడగళ్ల వర్షం రైతులను నిండా ముంచింది. గురువారం మధ్యాహ్నం ఏకధాటిగా పడిన రాళ్ల వాన పంటలను సర్వనాశనం చేసింది. కనీవిని ఎరగని రీతిలో విరుచుకుపడిన వడగండ్లు కర్షకులకు కడగండ్లను మిగిల్చాయి.

రైతన్నకు 'రాళ్ల' దెబ్బ
- బోరున విలపిస్తున్న బాధితులు
- తుడిచిపెట్టుకుపోయిన ఉద్యాన పంటలు
- పలు ఇళ్లు, వాహనాలు ధ్వంసం



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో ధ్వంసమైన పుచ్చ తోట

వికారాబాద్/మోమిన్‌పేట: మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఏం జరుగుతుందో అర్థం కాని స్థితినుంచి తేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గ్రామాల్లోని రోడ్లు, పంట పొలాలు, వాకిళ్లు మంచు రాళ్లతో నిండిపోయాయి. వడగళ్లతో అనేక రకాలుగా నష్టం వాటిల్లగా రైతులపై దీని ప్రభావం ఎక్కువగా పడింది. ప్రధానంగా ఉద్యాన పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. రైతులు సాగు చేసిన టమాటా, వంకాయ, బీర, చిక్కుడు, కాకర, మునగ, మామిడి, బొప్పాయి పంటలు పూర్తిగా పాడయ్యాయి. మామిడి తోటల్లోని కాయలు, పిందెలతో పాటు ఆకులు సైతం రాలిపోవడంతో చెట్లన్నీ మోడుబారినట్లు కనిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయాన్నే పొలాలకు వెళ్లిన రైతులు బోరున విలపించారు. బొప్పాయి తోటలు నేలకొరిగాయి. కూరగాయ పంటల మొదళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఉల్లి, వెల్లుల్లి, పసుపు పంటలకు సైతం నష్టం కలిగింది. మర్పల్లితో పాటు మోమిన్‌పేట మండల పరిధిలోని 13 గ్రామాల్లో కలిపి మొత్తం 2వేల ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మర్పల్లిలోనే అధికం

వికారాబాద్, మోమిన్‌పేట, నవాబుపేట, పరిగి తదితర మండలల్లోనూ వర్షం కురవగా మర్పల్లిలో మాత్రం అధిక నష్టం సంభవించింది. మిగిలిన మండలాల్లో ఉల్లి, పసుపు పంటలు పాడయ్యాయి. మర్పల్లిలో ఉద్యాన పంటలతో పాటు ఇతర సంప్రదాయ పంటలు చేజారిపోయాయి. పావుకిలో నుంచి కిలో బరువున్న రాళ్లు పడటంతో పలుచోట్ల కార్ల అద్దాలు పగిలిపోయాయి. వడగండ్ల వాన ప్రకృతి వైపరీత్యం కిందకు వచ్చే అవకాశం ఉన్నందున ఇన్సూరెన్స్ కూడా రాదని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెంకులు, బండల ఇళ్ల పైకప్పులు పాడయ్యాయి. పెద్దసంఖ్యలో కోళ్లు మృత్యువాతపడ్డాయి.

అకాల నష్టం

సయ్యద్‌అల్లీపూర్, ఇబ్రాహీంపట్టంపల్లి, పల్లెగుట్టతండా, కేసారం, ఎన్కేపల్లి గ్రామాల్లో వడగళ్ల వాన తీవ్ర ప్రభావం చూపింది. మొరంగపల్లి, గోవిందాపూర్, రాంనాథ్‌గుడుపల్లి, మల్లారెడ్డిగూడెం, వెల్‌చాల్‌లోనూ పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మిగిలిన గ్రామాల్లో కురిసిన సాధారణ వర్షంతో ఉల్లి పంట పాడైంది. 800 ఎకరాల్లో కూరగాయ పంటలు, 20 ఎకరాల్లో బొప్పాయి, 15 ఎకరాల్లో పూల తోటలు, నాలుగెకరాల్లో పుచ్చ, తర్బూజ తోటలకు నష్టం వాటిల్లింది. సయ్యద్‌అల్లీపూర్, ఇబ్రాహీంపట్టంపల్లిలో ఆరు రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి.

వందశాతం ఇవ్వాలి



వడగళ్ల వాన సృష్టించిన బీభత్సానికి పంటలు వంద శాతం పాడయ్యాయి. అతి వృష్టి కారణంగా ఇప్పటికే రెండేళ్లుగా పంటలు చేతికందలేదు. రాళ్లవానతో రైతులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలి.
– గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి

రూ.2 లక్షల నష్టం



పదేళ్లుగా పూల తోటలు సాగు చేస్తున్నా. ఇంతటి నష్టాన్ని ఎన్నడూ చూడలేదు. బంతి, మూడు రకాల చామంతి, రెండు రకాల గులాబీ తోటలు కోత దశకు వచ్చాయి. రాళ్ల వానతో రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– నర్సింహారెడ్డి, ఎన్నేపల్లి

అప్పులు ఎలా తీర్చాలో..



ఎకరా పొలంలో టమాటా, రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్నా. సాగు కోసం రూ.లక్ష పెట్టుబడి పెట్టా. చేతికి వచ్చిన సమయంలో ధ్వంసమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో నిద్ర పట్టడం లేదు.
– అంజిరెడ్డి, మర్పల్లి

ఒక్కరోజు ఆగితే..



ఎకరాలో పుచ్చ, ఎకరాలో తర్బూజ సాగు చేశా. మార్కెట్‌కు తరలించేందుకు వాహనం మాట్లాడుకున్నా. ఒక్క రోజు ఆగితే పంట అమ్ముకునేది. ఇంతలోనే వడగండ్లు ముంచేశాయి. పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలి.
– బాబుమియా, ఎన్కెపల్లి

‘పది’ంతల ఫోకస్

- టెన్త్‌లో వందశాతం ఫలితాలే లక్ష్యం
- విద్యార్థులను ఏబీసీ గ్రూపులుగా విభజించి బోధిస్తున్నాం
- ప్రతీఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం
- స్పెషల్ క్లాసుల సమయంలో స్నాక్స్ అందజేస్తున్నాం
- డీఈఓ రేణుకాదేవి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రేణుక

వికారాబాద్: పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులు నేర్చుకున్నది పరీక్షల్లో రాసేలా సంసిద్ధులను చేస్తున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏప్రిల్ 3నుంచి వార్షిక పరీక్షలు ప్రాంభమవుతాయని తెలిపారు. రెండు నెలలుగా స్పెషల్ కాస్లులు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. మిగతా వివారాలు ఆమె మాటల్లో..

గత ఫలితాలే స్ఫూర్తిగా

గతంతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. కరోనాకు ముందు టెన్త్ ఫలితాల్లో మన జిల్లా 27వ స్థానంలో ఉండేది. గతేడాది బాగా కష్టపడటంతో 24వ స్థానానికి చేరుకున్నాం. గతేడాది 24 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం రిజల్ట్ సాధించాం. 46 మంది విద్యార్థులు 10 జీపీఏ తెచ్చుకున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈసారి మరింత కష్టపడుతున్నాం. జిల్లాలో మొత్తం 13,324 మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10,834 మంది ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. 2,490 మంది ప్రైవేటు స్కూళ్లలో ఉన్నారు.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా స్నాక్స్ అందించేందుకు రూ.42,28,000 విడుదల చేసింది. స్పెషల్ క్లాసులు నిర్వహించిన సమయంలో స్నాక్స్ అందజేస్తున్నాం. ఒంటిపూట బడులు ప్రారంభమైనందున టెన్త్‌కు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించాం. ఇందుకోసం ప్రతీ పాఠశాలలో నిత్యం ఇద్దరు ఉపాధ్యాయులు సాయంత్రం వరకూ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఈసారి అభ్యసన దీపికలు అందజేసింది. వీటిద్వారా స్టూడెంట్స్‌ను ప్రిపేర్ చేస్తున్నాం. రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. మొదటి దఫాలో ఉపాధ్యాయులే ప్రశ్నపత్రాలు తయారు చేయగా.. ప్రస్తుతం కొనసాగుతున్న సెకండ్ ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యాశాఖ నుంచి వచ్చిన క్వశ్చన్ పేపర్లతో ఎగ్జామ్స్ రాయిస్తున్నాం. విద్యార్థులు రాసిన జవాబుల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే వివరిస్తున్నాం. ఫైనల్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఏబీసీ గ్రూపులుగా విభజించి అందరికీ అర్థమయ్యేలా బోధిస్తున్నాం.

నిత్యం వేకప్ కాల్స్

కేవలం పాఠాలు బోధించి.. చదువుకోమని చెప్పి ఊరుకోవడం లేదు. విద్యార్థుల దృష్టి చదువుపై కేంద్రీకరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఉదయం 5 గంటలకు వేకప్ కాల్స్ చేసి నిద్ర లేపుతున్నాం. నిరంతరం పేరెంట్స్‌తో మాట్లాడే బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించాం. పోషకులను స్కూళ్లకు పిలిచి మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నాం. తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇతర పనులు చెప్పకూడదని సూచిస్తున్నాం. వెనకబడిన, పాఠశాలకు సరిగ్గా రాని వారిపై మరింత శ్రద్ధ చూపుతున్నాం. హెచ్‌ఎంలు, ఎంఈఓలతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నేను కూడా నేరుగా ఫోన్‌లో మాట్లాడుతున్నా.. హెచ్‌ఎంలతో తరచూ మీటింగ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఈసారి మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- సయ్యద్‌పల్లి పాఠశాలలో డీఈఓ విచారణ
- విద్యార్థులను కొట్టొద్దని సూచన
- మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేయాలని పిలుపు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

పరిగి: విధులను నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి హెచ్చరించారు. మండల పరిధిలోని సయ్యద్‌పల్లి యూపీఎస్‌ను శుక్రవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాజేందర్ మద్యం తాగి వచ్చి విద్యార్థులను చితకబాదుతున్నాడంటూ ఇటీవల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పాఠశాలను సందర్శించిన డీఈఓ ఘటనకు సంబంధించిన వివరాలను విద్యార్థులు, టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులను తిట్టడం, కొట్టడం వంటివి నేర మని స్పష్టంచేశారు. నాణ్యమైన బోధనతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు



తాండూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తపస్ నాయకులు

- ఏవీఎన్ రెడ్డి గెలుపు చరిత్రాత్మకం
- తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు
- తాండూరులో విజయోత్సవ ర్యాలీ

తాండూరు టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపర్చిన అభ్యర్థి ఎ.వెంకటనారాయణ రెడ్డి విజయం బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు వంటిదని తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్ వంటి బలమైన సంఘాల అభ్యర్థులను మట్టి కరిపించి, తపస్ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం చరిత్రాత్మకమన్నారు. విద్యారంగ, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారని నమ్మి.. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిపిస్తే, ప్రభుత్వానికి తొత్తులుగా మారిన నేతలకు ఉపాధ్యాయులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. సమయానికి వేతనాలు రాకపోవడం, డీఏలు, పీఆర్సీ, ఎరియర్స్, 317 జీఓ రద్దు, పీఈటీలు, భాషాపండిట్ల అప్‌గ్రెడేషన్, బదిలీలు, పదోన్నతులు, పాఠశాలల అభివృద్ధి తదితర సమస్యలను విస్మరించిన ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. జాతీయవాద భావాలున్న ఏవీఎన్ రెడ్డి గెలుపునకు కృషి చేసిన టీచర్లు, లెక్చరర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఎదురు దెబ్బ

- పీఆర్‌టీయూ కొంప ముంచిన 'రెబల్'
- 1,169 ఓట్ల తేడాతో బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపు



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న ఏవీఎన్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూకి ఓటర్లు షాక్ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓటింగ్‌లోనే కాదు, రెండో ప్రాధాన్యత ఓటింగ్‌లోనూ పీఆర్‌టీయూ అభ్యర్థులను కాదని.. బీజేపీ బలపర్చిన అయ్యాలపు వెంకటనారాయణరెడ్డికి పట్టం కట్టారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు ఆధిక్యతను కొనసాగిస్తూ వచ్చిన ఏవీఎన్‌రెడ్డి 21వ రౌండ్ ముగిసే సరికి సమీప ప్రత్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిపై 1,169 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని.. ఈ గెలుపు తనపై బాధ్యతను మరింత పెంచిందని.. మండలి వేదికగా ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏవీఎన్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గెలుపు.. ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు.

రెండుగా చీలి.. ఓడి

ఉపాధ్యాయ సంఘాల్లో పీఆర్‌టీయూ బలమైన సంఘం. అత్యధిక సభ్యత్వం ఉన్న ఈ సంఘం మొదటి నుంచీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రభుత్వానికి అనుబంధంగా వ్యవహరిస్తూ వస్తోంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఈ సంఘం అభ్యర్థులే గెలుపొందారు. తాజాగా ఈ సంఘం రెండుగా చీలిపోయింది. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి టీపీఆర్‌టీయూ నుంచి పోటీ చేయగా, ఉద్యోగ సంఘం నేతగా గుర్తింపు పొందిన గుర్రం చెన్నకేశవ రెడ్డి పీఆర్‌టీయూటీఎస్ నుంచి పోటీ చేశారు. సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులు చెన్నకేశవరెడ్డికి మద్దతుగా నిలిచారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పని చేసినందున పోటీ నుంచి ఉపసంహరించుకోవాలని కాటేపల్లిని కోరారు. అయినా ఆయన పోటీకే సిద్ధమయ్యారు. ఒకే సంఘం నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవడం కొంప ముంచింది. ముందు నుంచి అంతా భావించినట్లే చెన్నకేశవరెడ్డి ఎన్నికల్లో గట్టిపోటీ ఇవ్వగా.. కాటేపల్లి ఘోరపరాభవాన్ని చవిచూశారు. పీఆర్‌టీయూ ఓటమికి ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండటం ఒక కారణమైతే.. జీఓ నంబర్ 317, స్పౌజ్ కేసుల బదిలీలు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు, ఖాళీల భర్తీ వంటి అంశాలు మరో కారణమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

వారికి చుక్కెదురు

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి ఖాతాలో పడతాయని అంతా భావించారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందే అవకాశం ఉన్నట్లు ఆశించారు. కానీ ఓటర్లు యూటీఎఫ్‌ను సైతం తిరస్కరించారు. అధికార బీఆర్‌ఎస్‌తో చెలిమి ఆ సంఘానికి ప్రతికూల ఓటు పడేలా చేసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ స్వయంగా ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల బరిలో అభ్యర్థిని నిలబెట్టినా.. ఆశించిన స్థాయిలో ఓట్లు పడలేదు.

పోటాపోటీగా ఆందోళనలు

హుడాకాంప్లెక్స్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి డబ్బులు పంచడంతో గెలిచాడని పీఆర్‌టీయూ నాయకులు ఆరోపించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం తెల్లవారుజామున లెక్కింపు సమయంలో కొంత ఆందోళన చోటు చేసుకుంది.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య శుక్రవారం తెలిపారు. తాండూరు, రుక్మాపూర్ స్టేషన్ల మధ్య గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతదేహం కనుగొన్నట్లు చెప్పారు. రైలు ఢీకొనడంతో మృతి చెందాడని, ఒంటిపై గోధుమరంగు షర్ట్, నీలి రంగు జీన్స్ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..


సోనుబాయి (ఫైల్)

యాలాల: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మండల పరిధిలోని సంగాయగుట్టతండాకు చెందిన రమావత్ సోనుబాయి(28) గత ఆదివారం తన భర్త రూప్‌సింగ్‌తో కలిసి తాండూరు నుంచి తండా వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కమాల్‌పూర్ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. స్థానికుల సహాయంతో సోనుబాయిని రూప్‌సింగ్ తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరానికి రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. సోనుబాయి మృతి చెందడంతో తండా వాసులు కన్నీరుమున్నీరయ్యారు.

యువకుడి ఆత్మహత్య


మంజునాథ్ (ఫైల్)

అనంతగిరి: కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్‌లో ఉప్పు మల్లప్ప, శోభ దంపతులు, శుభకార్యాల్లో వంట పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఏకైక కుమారుడు మంజునాథ్(20). పదో తరగతిలో ఫెయిల్ అయినప్పటినుంచి ఖాళీగా ఉంటూ తిరుగుతుండటంతో ఏదైనా పని వెతుక్కోవాలని పలుమార్లు తల్లిదండ్రులు సూచించారు. గురువారం తల్లిదండ్రులు జహీరాబాద్‌లో జరిగే ఓ శుభకార్యంలో వంటలు చేసేందుకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హయత్‌నగర్: విద్యుదాఘాతానికి ఓ వ్యక్తి మృతి చెందాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలో నివాసం ఉంటున్న దేవిడి నరేందర్‌రెడ్డి(50) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఆకుల ఈశ్వర్ పస్మాములలోని అతన్‌భాయి ఫాంహౌస్‌లోని చేపల చెరువు వద్ద పని ఉందని తీసుకెళ్లాడు. పని చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందాడు.

ఆతిథ్యం ఇచ్చేదెన్నడో?

- నత్తనడకన అతిథి గృహ నిర్మాణం పనులు
- నాలుగేళ్లు దాటినా పూర్తికాని వైనం

అనంతగిరి: ప్రశాంత వాతావరణానికి నిలయమైన అనంతగిరి గుట్టలో అతిథి గృహ నిర్మాణం ఏళ్లు దాటుతున్నా పూర్తికావడంలేదు. ప్రకృతి రమణీయతకు ఆలవాలమైన అనంతగిరికి ఎందరో ఉన్నతాధికారులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో అతిథిగృహం నిర్మించాలనే ఉద్దేశ్యంతో 2018లో నాటి రోడ్డు రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అనంతగిరి గుట్టపై శంకుస్థాపన చేశారు. మొదట పనులు వేగంగా జరిగాయి. కరోనా విపత్కర పరిస్థితుల వేళ పనులు నిలిచిపోయాయి. ఇదే క్రమంలో బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు ఆలస్యంగా కొనసాగాయి. కోవిడ్ అనంతరం సదరు కాంట్రాక్టర్ పనులు చేపడుతూ ఇప్పటివరకు స్లాబ్‌లెవల్‌తో గోడలు పూర్తయ్యాయి. కంపౌండ్ నిర్మాణం సైతం పూర్తయ్యింది. కాగా ఈ మధ్య కాలంలో కార్మికుల కొరత వల్ల మళ్లీ పనులు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు కూడా సదరు కాంట్రాక్టర్‌కు పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అతిథి గృహంలో నాలుగు ఏసీ సూట్‌లతో పాటు వంట గది, హాల్, సెక్యూరిటీ , వాచ్‌మెన్ రూంలు నిర్మిస్తున్నారు.


అనంతగిరిలో అసంపూర్తిగా ఉన్న అతిథి గృహం

వీటితో పాటు కంపౌండ్ వాల్, సీసీ రోడ్డు కూడా వేయనున్నారు. ఒకే సమయంలో నలుగురు వీఐపీలు వచ్చినా ఉండేందుకు వీలుగా ఈ నిర్మాణం కొనసాగుతోంది. త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చేలా తగిన చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

మూడు నెలల్లో పూర్తి

అనంతగిరిలో అతిథి గృహ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. రాబోయే మూడు నెలల్లో పనులు పూర్తి చేసి అప్పగించాలని చెప్పాం.

– శ్రీధర్‌రెడ్డి, డీఈ, ఆర్అండ్‌బీ, వికారాబాద్

వడగళ్ల బాధితులను ఆదుకోవాలి

బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్

మర్పల్లి: వడగళ్ల వానతో పంటలన్నీ దెబ్బతిన్నాయని, తక్షణం రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్ డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లి, మర్పల్లి, కొత్లాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. రైతులు ఆందోళనకు గురికావద్దని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడంతోనే రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫసల్ బీమా పథకం అమలు చేసిఉంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు బీమా కంపెనీలు పరిహారం ఇచ్చేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే పరిహారం ఇవ్వాలన్నారు. మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.28 వేలు, కూరగాయ పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. రైతులందరికీ రూ.లక్షలోపు రుణమాఫీని తక్షణమే మాఫీ చేయాలని కోరారు. ఆయన వెంట కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, బల్‌రాంమ్‌గౌడ్, శ్రీనివాస్, మండల నాయకులు ప్రవీణ్, మధుకర్, మహేష్, శ్రీమంత్‌కుమార్, సంతోశ్‌రెడ్డి రైతులు ఉన్నారు.


మర్పల్లిలో దెబ్బతిన్న టమాటా పంటను పరిశీలిస్తున్న పాపయ్యగౌడ్, నాయకులు

48 గంటలు గడిచినా కరగని వడగళ్లు

గురువారం మధ్యాహ్నం కురిసిన వడగళ్లు 48 గంటలు గడిచినా కరగలేదని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్ తెలిపారు. రెండు రోజులుగా కరగ లేదంటే వర్షం తీవ్రత అధికంగా ఉండటమే కారణమన్నారు. మండలంలో టమాటా, క్యాలీఫ్లవర్ పంటలను ఆయన పరిశీలించారు.

ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణం


నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

కొడంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాలకు దూరంగా స్థలం కేటాయించడంతో ఆటలకు అనువుగా లేకుండా పోయాయి. ఆయా గ్రామాల్లో పలువురు క్రీడాకారులు అక్కడకు వెళ్లి శిక్షణ పొందాలంటే కనీస సౌకర్యాలు లేవు. గ్రామీణ క్రీడా ప్రాంగణం అనే బోర్డు ఒక్కటి పెట్టి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆటలకు అవసరమైన సామగ్రి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


విశేష అలంకరణలో స్వామివారు


సుగంధద్రవ్యాలను తీసుకొస్తున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టిన ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మూలవిరాట్ మూర్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం తిరుమంజనం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు, కుంకుమ, పసుపు, చంధనం, కర్పూరం తదితరవాటితో ఆలయాన్ని శుద్ధి చేశారు. తిరుమల తరహాలో ఇక్కడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, నిత్య సేవలు, నిత్య కైంకర్యాలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, తిరుమల నుంచి వచ్చిన అర్చకులు ఆలయం శుద్ధి చేస్తూ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: వడగళ్ల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనా వేసి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల పరిధిలోని మర్పల్లి తండా, మర్పల్లి, కొత్లాపూర్ గ్రామాల్లో వడగళ్ల వల్ల దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 9,500 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలను సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు గ్రామాలకు వస్తే సీఎంతో మాట్లాడి అక్కడికక్కడే పరిహారం ఇచ్చే విధంగా ప్రకటన చేశారని ఆయన గుర్తు చేశారు. మంత్రులు వచ్చి పరిహారం ఇస్తామని ప్రకటన చేయకుండా సీఎం దృష్టికి తీసుకెళ్తామనడం సరికాదన్నాడు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు సలీం, అబ్రహాం, సర్వేశ్ రైతులు ఉన్నారు.


మర్పల్లిలో పాడైన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

ఊసేలేని 'యంత్ర లక్ష్మి'

షాబాద్: రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు ద్వారా ఎకరాలకు ఏడాదికి రూ. 10వేలు అందిస్తూనే మరో వైపు అన్నదాతల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోంది. ఐదేళ్లుగా యంత్రలక్ష్మి పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా స్పందించడం లేదు. దీంతో రైతులు పొలం పనులకు కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. 2017–18 ఆర్థిక సంవత్సరం వరకు యంత్రలక్ష్మి పథకం సజావుగా సాగింది. తదనాంతరం ఈ పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పథకం ద్వారా రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వరినాట్లు వేసే యంత్రాలు, కల్టివేటర్లు, రోటోవేటర్లు తదితర యంత్రాలను సబ్సిడీ ద్వారా సరఫరా చేసేవారు. దీంతో రైతులు కూలీలపై ఆధారపడకుండా యంత్రాలతో పొలం పనులు చేసుకునే వారు. యంత్రలక్ష్మి ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గేవి.

నిలిచిన పథకం

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 3,13,332 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1,55,102 ఎకరాల్లో, కూరగాయలు, పూలు, వేరుశనగ 1,19,072 ఎకరాల్లో, మొక్కజొన్న 20,917 ఎకరాల్లో, మిగిలిన ఎకరాల్లో పలు పంటలను సాగు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ కూలీలు దొరికినా ఒక్కొక్కరికి రోజుకు రూ. 500 నుంచి రూ. 700 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. అదే యంత్రాలతో అయితే రూ. 2వేలతో పనులు పూర్తి చేయవచ్చని తెలిపారు. సబ్సిడీపై యంత్రాలు ఇస్తే భారం తగ్గుతుందని రైతులు అంటున్నారు.

బలవంతపు పెళ్లి.. 1098కు బాలిక ఫిర్యాదు

అనంతగిరి: బలవంతంగా పెళ్లి జరిపించారని ఓ బాలిక 1098ను ఆశ్రయించగా.. ఇందుకు స్పందించిన న్యాయమూర్తులు ఆ బాలికను సురక్షితంగా చైల్డ్ వెల్ఫేర్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పూడూరు మండలానికి చెందిన బాలికకు వారి తల్లిదండ్రులు బంధువుల అబ్బాయితో ముంబైలో బలవంతంగా వివాహం చేశారు. ఈ విషయం సదరు బాలిక వారి బంధువుల సహాయంతో 1098కు ఫిర్యాదు చేయించింది. బలవంతపు బాల్యవివాహం చేసిన వారిపై, పెళ్లి చేసుకున్న అబ్బాయిపై చన్గోముల్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ విషయమై హైకోర్టు జడ్జి ఎంజీ. ప్రియదర్శిని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్ రెండు రోజుల క్రితం బాలికను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు బాలిక తల్లిదండ్రులను విచారించగా రాజస్థాన్‌లో ఉన్నట్లుగా తెలిపారు. పోలీసులు అక్కడికి వెళ్లి బాలికను తీసుకువచ్చి జడ్జి ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆ బాలికను చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, న్యాయసేవా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాటుబాంబు కలకలం

యాచారం: అటవీ ప్రాంతంలో ఓ నాటుబాంబు పేలడం కలకలం సృష్టించింది. యాచారం మండల పరిధిలోని గాండ్లగూడెంకు చెందిన కసరమోని మల్లేశ్ శుక్రవారం తనకున్న మేకలు, గొర్రెలను మేత కోసం గ్రామ సమీపంలోని పావురాలగుండ్ల అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. ఓ మేక మేత మేస్తున్న సమయంలో బండరాళ్ల మధ్యలో ఉన్న నాటుబాంబును కొరికింది. అది పేలడంతో మేక గాయపడింది. కాగా, నాటుబాంబు కలకలంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.


యాచారం సమీపంలో నాటుబాంబును కొరకడంతో తీవ్రంగా గాయపడిన మేక

ఆలయాల జీర్ణోద్ధరణ అభినందనీయం


పెద్దమంగళారంలో దేవాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

- ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పెద్దమంగళారంలో దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

మొయినాబాద్: గ్రామాల్లో ఆలయాల జీర్ణోద్ధరణకు చర్యలు చేపడుతుండటం అభినందనీయమని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఆల్ ఇండియా పురాతన దేవాలయ పునర్నిర్మాణ ట్రస్ట్, గ్రామస్తుల సహకారంతో శిథిలావస్థకు చేరిన సుమారు 200 ఏళ్ల నాటి కుచనపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ప్రముఖ సినీ హీరో సుమన్ తదితరులు వేర్వేరుగా వచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో దేవాలయాలు ఉంటేనే ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందన్నారు. శిథిలావస్థకు చేరిన వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు ముందుకొచ్చిన ఆల్ ఇండియా పురాతన దేవాలయ పునర్నిర్మాణ ట్రస్ట్, గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పురాతన దేవాలయాలను పునర్నిర్మించేందుకు ఆధ్యాత్మిక వేత్తలు, యువత ముందుకు రావాలన్నారు. యువతలో భక్తిభావం పెరగాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరోత్తంరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్, జెడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీలు కొంపల్లి అనంతరెడ్డి, కంజర్ల భాస్కర్, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్, మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్, నాయకులు కొత్త నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, జయవంత్, ఆండ్రూ, జైపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, హన్మంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


గోనూర్ శివారులోని కాగ్నానదిలో తవ్విన ఇసుక

- గోనూర్‌లో రెచ్చిపోతున్న మాఫియా
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం
- కలెక్టర్ స్పందించాలని కోరుతున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: ఎండాకాలం వస్తే చాలు ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. పొలాలు బీడుగా ఉండటంతో ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్లు ఉన్న యజమానులు సిండికేట్‌గా మారి ఇసుకను తరలిస్తున్నారు. మండల పరిధిలోని గోనూర్ గ్రామ శివారులో కాగ్నా నది ఉంది. రాత్రి అయితే చాలు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఊరు దాటిస్తున్నారు. ఊరిలో ఉన్న ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారి రెచ్చిపోతున్నారు. గోనూరు శివారులో ఉన్న కాగ్నానది నుంచి రాత్రి ట్రాక్టర్ల ద్వారా మాచనూర్ మీదుగా ఇసుకను బషీరాబాద్‌కు తరలిస్తున్నారు. కాశీంపూర్, బద్లాపూర్, తండాతో పాటు వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ.4వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. ఇంకొందరు తమ వ్యవసాయ పొలాల్లో ఇసుకను డంపింగ్ చేసుకొని చీకటి పడగానే తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గోనూర్ గ్రామ శివారులో ఉన్న కాగ్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికడతాం. ఎవరైనా అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలి. అభివృద్ధి పనులకు కాకుండా ఇష్టారాజ్యంగా డంపింగ్ చేసి అమ్ముకుంటే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– చిన్నప్పల నాయుడు, తహసీల్దార్, తాండూరు

తాండూరులో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్
- పట్టణంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం


ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: వచ్చే ఎన్నికల్లో తాండూరులో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ అన్నారు. శుక్రవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా పట్టణాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర పభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, ఈ శ్రామ్ కార్డ్స్, ఉజ్వల యోజన వంటి పలు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలను తామే అమలు చేస్తున్నట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపుతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉద్యోగులకు ఉన్న వ్యతిరేకత అర్థమవుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తాండూరులో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజల చేతిలో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్, కార్యదర్శి భద్రేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, కౌన్సిలర్‌లు లలిత, లావణ్య, బాలప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి దోమ కృష్ణ, ఉపాధ్యక్షులు కోట్ల నరేందర్, నాయకులు శాంత్‌కుమార్, పూజారి పాండు, సతీష్, సంగమేశ్వర్, ఉమాదేవి, రేణుక, ఆర్తి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.